

# నీహారిక

కరుణానిధి ఈజీచెయిర్లో కూర్చుని లోపల జరిగే తతంగం అంతా చూస్తున్నాడు. లోపల హాల్లో దాదాపు పాతికమంది దాకా వున్నారు. అంతా అతనికి కావలసినవళ్ళే. అతని అన్నయ్య, వదిన, వాళ్ళ పిల్లలు, అల్లుడు, కూతురు, వియ్యంకుడు-అంతా హడావుడిగా అటూఇటూ తిరుగుతున్నారు. నిజానికి అంత తిరగవలసిన పనేంలేదు. అంత మందికి వంటవాడు ఇంకో రెండు వందల మంది వచ్చినా అవలీలగా కాలవసినవన్నీ తయారు చెయ్యగలడు. ఉన్న ఇద్దరు నౌకర్లూ ఇంటి పనంతా అవలీలగా చెయ్యగల సామర్థ్యం

వున్నవాళ్ళు. అయినా, ఇంత హడావుడి - ఇంత మంది తిరుగుతున్నారంటే . . . అది కేవలం అట్మాస్ఫియర్ క్రియేట్ చెయ్యటానికే.

కరుణానిధికి ఒంటరి తనం అంటే ఇష్టం. వయసులో ఉన్నప్పుడు అతడు మంచి భావుకుడు. ఆ రోజుల్లో అతను వీణ చాలా గొప్పగా వాయించేవాడు. తన తండ్రి తనకి చేసిన మంచి పనంటూ ఏదయినా ఉంటే అదేనని అతని నమ్మకం. కానీ, అది కూడా అతనికి ఎక్కువ కాలం ఆనందాన్ని ఇవ్వలేదు. పెళ్ళయిన కొత్తలో అతను వీణ పట్టుకోబోతే అతని భార్య నవ్వి, "అదేమిటండీ, ఆడపిల్లలాగా వీణా మీరూనూ" పరిహసించటమే కాక, అదేదో చాలా హాస్యాస్పదమైన విషయంలా తన తరపు బంధువులందరి దగ్గిరా ప్రచారం చేసింది. ఆవిడ తండ్రి ఆ విషయం విని నవ్వుతూ, "మా తాతయ్య ఉంచుకున్నావిడ వీణ బాగా వాయించేదోయ్. అయినా ఆ వీణలూ, మృదంగాలూ బోగంవాళ్ళు వాయిస్తేనే బాగుంటాయి గానీ, మనకెందుకోయ్!" అన్నాడు. ఆ వయస్సులో కరుణానిధిలో ఎంత సెన్సిటివెనెస్ దాగి వుండేదంటే . . . తరువాత ఎప్పుడూ అతడు వీణ ముట్టుకోలేదు.

"ఒరే! ఆ లడ్డూలు ఎక్కడ పెట్టేర్రా?" అన్న కేకతో ఈ లోకంలోకి వచ్చాడు కరుణానిధి. ఆ కేకకి ఈ లోకంలోకి వచ్చాడు కరుణానిధి. ఆ కేక అతని తల్లిది. ఆ కేక పాతిక మందినీ ఒక్క క్షణం మాటలు ఆపుచేసేటట్టు చేసింది. ఒక్క క్షణం అందరూ అటు చూసి మళ్ళీ తమ మామూలు గొడవల్లో పడిపోయారు.

తల్లి కేకలు లోపలి నుంచి ఇంకా వినబడుతున్నాయి. తన కొడుకు తాలూకు వియ్యంకుడూ వాళ్ళూ ఉన్నారన్నది గూడా మరిచిపోయి ఆమె అరుస్తూంది. చిత్రమేమిటంటే, కొత్తవాళ్ళు గూడా దాన్నంతగా పట్టించుకోకుండా తమలో తాము మాట్లాడుకొంటున్నారు కరుణానిధి రెండో కొడుకు వేసిన చీప్ జోకుకి పెద్ద కోడలు చెల్లెలు విరగబడి నవ్వుతూంది. అతని రెండో కోడలు ఒక మూలగా కూర్చుని పిల్లవాడికి పాలిస్తోంది. గోపికల మధ్య కృష్ణుడిలా కరుణానిధి వియ్యంకుడు అందరి మధ్యా కూర్చుని చుట్ట కాలుస్తూ లోకాభిరామాయణం మాట్లాడుతున్నాడు. పక్క వరండాలో పిల్లలు గట్టిగా అరుస్తూ అల్లరి చేస్తున్నారు. ఎవరో పాప గుక్క పెట్టి ఏడుస్తూంది.

కరుణానిధిని ఒక్కసారిగా భరించలేనంతగా నిస్సత్తువ ఆవరించింది. ఏదో ఎగానీ . . .

"వాళ్ళందరూ ఏదో నీచమైన స్థితిలో వున్నారు. తనొక్కడే ఉన్నతుడు" అని అతను అనుకోవటం లేదు. అతనికి కావలసిందేదో యేభయి సంవత్సరాలుగా అతనికి అర్థం కాలేదు.

తన తల్లి శాడిస్టేమోనని కరుణానిధి అనుమానం. ఆమె అలా శాడిస్టుగా మారటానికి తన తండ్రేననీ, స్త్రీకి కావలసినంత ప్రేమని తన తండ్రి చూపించకపోవటం వల్లనే తన తల్లి అలా అయిందన్న విషయం తెలుసుకొన్నాక కరుణానిధికి స్త్రీ పట్ల మరింత గౌరవం పెరిగింది. ఆ గౌరవాన్ని అప్పుడప్పుడు అతని చెల్లెలు కొట్టేసేది.

"పొద్దున్న ఏడింటికి నాతో బాటు లేస్తావేం?" అడిగేవాడు చెల్లెల్ని.

"ఇంకా ముందే తెల్లవారు ఝామున లేచి యేమి చెయ్యాలి?"

"పొందికగా స్నానం చేసి అందరూ లేచేసరికి మల్లెపువ్వులా . . . "

"ఇంకా నయం ఇంటి ముందు కళ్ళాపిజల్లి, ముగ్గువేసి, ఆ తరువాత తులసిచెట్టుకి దణ్ణం పెట్టి . . . " నవ్వేది.

కరుణానిధికి ఈ విషయం అంత బాధ అనిపించలేదు.

అతని ఊహల్లో స్త్రీ వేరు . . . తల్లి కాదు, చెల్లెలు కాదు. సెక్స్ విషయమైన బాధకూడా అంతగా లేదు. ఇరవై రెండేళ్ళ వయసులో వుండవలసిన మామూలు కోర్కెల కన్నా భిన్నమైప భావుకత్వం.

దూరంగా పగలు, రాత్రి కలిసిపోయే వేళ, ఆ ఎర్రటి సంధ్యంలోంచి గులాబీ రేకుల తెల్ల చీరెని కట్టుకొని, వెన్నెల తాలూకు లాలిత్యాన్నీ, పొగ మంచు సౌకుమార్యాన్ని పోగు చేసుకొని, మందాకినిలా నెమ్మదిగా వచ్చి, తన రాగరంజిత రసానుబంధంలో . . . ఇరవై రెండేళ్ళ ఒంటరి తనాన్ని పోగొట్టి . . .

"ఏమిటింకా అలానే కూర్చున్నారు?" అన్న ప్రశ్నతో ఈ లోకంలోకి వచ్చాడు కరుణానిధి.

ఎదురుగా కనకం నిలుచుని వుంది. పరిశీలనగా భార్యవైపు చూశాడు.

చెవుల వెనక కొద్దిగా తెల్లబడుతున్న జుట్టూ, చీరకీ జాకెట్టుకీ మధ్య మడతలు పడిన పొట్టా, నిర్లక్ష్యంగా కట్టుకోవడం వల్ల మరింత వికృతంగా కనబడుతున్న చీర.

'ఎందుకు యీ స్త్రీ తన భర్తకి కొంచెం నాజూకుగా కనబడాలని ఒక్కసారైనా అనుకోదు?'

ఈ ప్రశ్నని దాదాపు పదివేల సార్లయినా అనుకుని ఉంటాడు అతను. సమాధానం దొరకలేదు. దొరుకుతుందని అతను అనుకోలేదు కూడా. పోతే పెళ్ళయిన కొత్తలో తన ఊహాసుందరిని తన భార్యకి ఆపాదించుకొని, ఘోరంగా ఫెయిలయిన తరువాత తను కూడా తన తల్లి లాగానే శాడిస్టుగా మారిపోతానేమోనని భయపడ్డాడు. దానినించి అతణ్ని రక్షించింది మళ్ళీ అతని ఊహాలోకమే.

ఈసారి అతని ఊహల్లో కనబడే దేవత - అతని కాబోయే భార్య కాదు; ఒక అమ్మాయి . . . వయసు పదహారు. ఓణి, పరికిణీ, మొహం నిండా అమాయకత్వం, పెదవుల మీద స్నిగ్ధమైన చిరునవ్వు.

ఆ అమ్మాయి మీద ఎప్పుడూ అతనికి చెడు తలంపు వచ్చేది కాదు. ఒక విధమైన ఆప్యాయత. లాలనగా తల నిమరాలనీ, ఆత్మీయతతో గుండెలకి హత్తుకోవాలనీ ఎవరామె? తనకు పుట్టబోయే కూతురా?

"ఏమిటలా గుడ్లు అప్పగించి చూస్తారు? లేచి స్నానం చేయండి" అంది కనకం.

కరుణానిధి కుర్చీలోంచి లేవకుండా . . . "అవే మాటల్ని కొంచెం చిరునవ్వుతో ఎలా చెప్పవచ్చో తెలుసా" అన్నాడు.

"ఎలా?"

"ఏమిటి నా వైపు అంత తదేకంగా చూస్తున్నారు? కొత్త అందాలేమైనా కనబడుతున్నాయా? లేచి స్నానం చేయండి."

కనకం మొహం చిట్లించి, "చాల్లెండి సంబడం. వయసొస్తున్నా ఏమిటా పాడువేషాలు? లేవండి" అంది విసుగ్గా.

స్నానం చేస్తూ మళ్ళీ ఆలోచనలో పడ్డాడు.

పాతిక సంవత్సరాల క్రితం . . . ఇప్పుడు తన అల్లుడున్న స్థితిలోనే తనూ ఉన్నాడు. ఆ రోజు అలాగే, తన కూతురు . . . నామకరణోత్సవం.

ఆ రోజు . . .

పాపని అపురూపంగా ఒడిలో పడుకోబెట్టుకొన్నాడు.

"ఏం పేరు పెడుతున్నారమ్మా పాపకి?" ఏమీ తెలియనట్టు ప్రశ్నిస్తోంది అత్తగారు - అంతక్రితమే తన తండ్రి పేరు పెట్టించడం కోసం కూతురికి నూరిపోసినావిడ. ఆవిడ తండ్రి పేరు సుబ్బరామయ్య.

ఇంకోవైపు తన తల్లి కనకమహాలక్ష్మి పేరు పెట్టాలని ఆవిడ వాదన.

చర్చలూ, మూతిబిగించుకోవటాలూ, సణుగుళ్ళూ, అన్యాపదేశంగా విసుర్లూ.

ప్రళయం వచ్చేముందు ప్రశాంతత.

ఆ ప్రశాంతంలో - తన కోర్కెలకి సమాధికట్టి, అప్రయత్నంగా పేరు వ్రాశాడు.

"సుబ్బలక్ష్మి".

అతని నిర్లిప్తతని సునిశితంగా గమనించే ఓర్పు వాళ్ళకి లేదు. తమ పట్టు గెలిపించుకొన్న సంతృప్తి.

అంత క్రితం "మీకేం పేరు యిష్టం?" అని భార్య అడిగినప్పుడు చెప్పాడు.

నవ్వింది.

విరగబడి నవ్వి "అదేం పేరండీ!" అంటూ తెరలు తెరలుగా నవ్వి "నీ . . . హా . . . రి . . . కా . . . అదేం అర్థం పర్థంలేని పేరూ?" అని సాగదీసింది.

ఏదో మాట్లాడబోయాడు.

"చాల్లెండి ఎవరయినా వింటే నవ్విపోతారు. ఇంక ఊరుకోండి" అని నోరు నొక్కేసింది.

కరుణానిధి మాట్లాడలేదు. అతనిలో సంఘర్షణపోయి కొద్ది కొద్దిగా ఆ స్థానంలో నిర్లిప్తత చోటు చేసుకుంటూంది.

"ఎవరమ్మా బాత్‌రూమ్‌లో?" సుబ్బలక్ష్మి కంఠం.

"మీ నాన్నగారు."

"అయితే యిప్పుడిక తెమిలినట్టే" కూతురు కంఠం విసుగ్గా వినిపించింది. "అయినా, అంత తెగని ఆలోచన లేమిటో?"

కరుణానిధి చప్పున తువ్వాలుతో ఒళ్ళు తుడుచుకొని బయటపడ్డాడు.

లోపల అంతా హడావుడిగా వుంది. అల్లుడి మొహం వెయ్యి కాండిల్ బల్బ్‌లా వెలిగిపోతోంది. అతని చేతుల్లో పాప కరుణానిధి పాపవేపు తదేకంగా చూశాడు.

పెద్ద పెద్ద కళ్ళూ, లేత చెక్కిళ్ళూ, చిన్న నోరూ, బోసి చిరునవ్వూ.

తను కలల్లో సృష్టించుకొన్న ఊహాచిత్రం యీ పాపలో ప్రతిబింబించ బోతూందా?

"ఏమిటి తదేకంగా చూస్తున్నారు?

అల్లుడి మాటలతో తేరుకుని . . . "ఏం లేదు" అన్నాడు.

"ఇకనుండి మీకు బోలెడంత సందడి."

"ఔను" అన్నాడు కరుణానిధి చిరునవ్వుతో. అతని హృదయం ఏదో అవ్యక్తానందంతో నిండింది. మనుమరాలిని తమదగ్గరే వదిలేయటానికి అల్లుడూ, కూతురూ ఒప్పుకోడం వలన వచ్చిన ఆనందం అది.

ఈ శిల్పాన్ని చాలా తీరికగా చెక్కుకుంటాడు తను ఎక్కడా అపశ్రుతి పలక్కుండా ఈ వీణ లయతీగెల్ని అపురూపంగా బిగించుకొంటాడు. తల్లీ, భార్యా, చెల్లీ, కూతురూ అందరూ ఈర్ష్య పడేలా ఈ పాపని తయారుచేస్తాడు.

"రండి ముహూర్తం దగ్గిర పడుతూంది" కూతురు పిలుస్తూంది. అల్లుడు పాపని ఎత్తుకుని లేచాడు.

"నేను చెప్పింది జ్ఞపకం వుందిగా?" కరుణానిధి అభ్యర్థనగా అడిగాడు.

"ఏది?"

"అదే - - పేరు"

అల్లుడు నవ్వి లోపలి కెళ్ళేడు.

"తొందరగా రండి" అరుస్తోంది కూతురు.

మొహం చిట్లించేడు. కోయిల కంఠాన్ని పోలిన స్వరాన్ని దేవుడిచ్చినందుకు - ఆ వరాన్ని ఎందుకు యీ ఆడవాళ్ళు యిలా గొంతు చించుకొని అరచి పాడుచేసు కొంటారు?

"లోపలికి రా నాన్నా" అని గుమ్మంలో నిలబడి పిలుస్తోంది కూతురు. తల ఎత్తి చూశాడు. కూతురు పుట్టినా రెండు జడలు వేయడం మాననట్టుంది. కాలేజీకి వెళ్ళే రోజుల్లో తను అనేవాడు.

"ఒక్క జడ వేసుకో అమ్మా"

"ఇప్పుడు రెండు జడలే ఫాషన్ నాన్నా"

"నీలా పొడుగ్గా ఉన్నవాళ్ళకి ఒక్క జడే బాగుంటుందమ్మా."

"కాలేజీలో అందరూ బి సి అని యేడిపిస్తారు నాన్నా."

"నీకు బాగుంటుందని తోచినప్పుడు వాళ్ళు ఏడిపిస్తారని భయపడక్కర్లేదమ్మా. అదే వ్యక్తిత్వాన్ని నిర్మించుకోవడం అంటే!"

"నువ్వు మరీ కథల్లోలా మాట్లాడతావు నాన్నా" తేలికగా తీసి పారేసింది. కాలంతో బాటు తను పెంచుకున్న కలల్ని ఒక చిన్న మాటతో తీసిపారేసింది. ఎలా మరచిపోగలడు తను ఆ రోజుల్ని?

కృష్ణశాస్త్రి బాట, ఈమని వీణానాదం, డాబామీద వెల్లకిలా పడుకొని క్రిందకు వంగిన

కొబ్బరి ఆకుల మధ్యనుంచి నీలాకాశాన్ని చూస్తూ రాసుకొన్న కవిత్వం.

ఏమైంది ఆ భావుకత్వం అంతా? తనని మానసికంగా చంపేసిన తనవాళ్ళందరికీ ఎందుకు భయపడి తన ఆశల్ని ఇలా నొక్కి పెట్టాడు?

ఏది ఏమైనా ఇక అలా కానివ్వడు. తన మనవరాలిని తన అభిరుచికి అనుగుణంగా దిద్దుకొంటాడు. ఇక దాన్నెవ్వరూ ఆపలేరు. ఆ పాప అందరిలా విరగబడి నవ్వదు. విరిసిన ముద్దబంతి పువ్వులా పొందికగా వుండటంలో ఎంత అందముందో ఆ పాప ద్వారా నిరూపిస్తాడు తను. పోతన పద్యాలనుంచీ కీట్స్ నైటింగేల్ వరకూ చదువుతుంది. తన కలం వీణియపై మోహనరాగాన్ని ఆలాపిస్తూంది ఆ పాప. వీలయితే శాంతి నికేతన్‌కి పంపి . . .

"ఏం పేరు పెడుతున్నారు?" తన భార్య అడుగుతోంది.

పాపని ఒడిలో పడుకోబెట్టుకొని కూర్చుని వున్నాడు అల్లుడు. పాతికేళ్ళ క్రితం తనూ అలాగే కూర్చుని వున్నప్పుడూ తన అత్తగారు సరిగ్గా అదే ప్రశ్న వేసింది.

అల్లుడు చిరునవ్వుతో పేరు వ్రాశాడు. అతని సస్పెన్సు అందరిలోనూ బాగానే పనిచేస్తుంది. కరుణానిధికూడా ఆత్రుతగానే ముందుకు వంగి చూశాడు. అతడి మొహం తెల్లగా పాలిపోయింది.

"కనక సుందరి."

"కరుణానిధి భార్య మొహం చేటంత అయింది. వియ్యంకుడు సుందర రామయ్య చెయ్యి అప్రయత్నంగా మీసం మీద వెళ్ళింది.

"ఏమిటి తాతయ్యా, అలా వున్నారు?" అడిగింది ఓ చిన్నపిల్ల. వరసకి మనమరాలు అవుతుంది.

"తన పేరు పెట్టలేదనేమో?" ఎవరో వేసిన చీప్ జోక్‌కి అందరూ ముసిముసిగా నవ్వుకొన్నారు.

"ఆయన కదేంలేదు. ఏ కవిత్వంపేరో పెడితే చాలు" భార్య డిస్కవరీ చేసినట్టు చెబుతూంది.

"ఏదీ? నీహారికేనా?" కూతురు అంది

మళ్ళీ అందరూ నవ్వు

ఆ పాప అతనికి దగ్గరగావచ్చి అమాయకంగా అడిగింది. "నీహారిక అంటే ఏమిటి తాతయ్య?"

కళ్ళని కప్పేసిన నీటిపొర ఎవరికీ కనబడకుండా వుండటానికి ప్రయత్నిస్తూ బలవంతంగా నవ్వి, "మంచు తెర" అన్నాడు కరుణానిధి.

❀ ❀ ❀

**(ఆంధ్రప్రభ - 1982)**